క్లుప్తంగా

రోడ్డు పనులకు శంకుస్థాపన

ఇచ్ఛాపురం రూరల్: ఈదుపురం పంచాయతీలో 15వ ఆర్థిక సంఘం నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు సర్పంచ్ నర్తు వరప్రసాద్ యాదవ్ శనివారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దువ్వ వివేకానందరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు నర్తు ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

తేనెకన్నా తియ్యనైనది తెలుగుభాష



గిడుగు, తెలుగుతల్లి వేషధారణలో పిల్లలు

ఇచ్ఛాపురం రూరల్: తేనెకన్నా తియ్యనైనది తెలుగుభాష అని బలరాంపురం ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సి.సూర్య ప్రభాకరరావు అన్నారు. తెలుగుభాషా వారోత్సవాల సందర్భంగా పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు భాషపై క్విజ్, వక్తృత్వ పోటీలను విద్యార్థులకు నిర్వహించారు. గిడుగు రామమూర్తి పంతులు, తెలుగు తల్లి వేషధారణలో విద్యార్థులు అలరించారు. తెలుగు భాష ప్రశస్తత, కృషి చేసిన కవులు గుర్చి వివరించారు.

సుమ్మాదేవిలో వైఎస్సార్ కంటి వెలుగు శిబిరం

పలాస: సుమ్మాదేవి గ్రామంలో వైఎస్సార్ కంటి వెలుగు శిబిరాన్ని శనివారం నిర్వహించారు. పలాస మండల నేత్ర వైద్యులు రోణంకి వెంకటరమణ ఆధ్వర్యంలో 22 మంది అవ్వాతాతలకు నేత్ర పరీక్షలు చేశారు. వీరిలో ఆరుగురికి కళ్లద్దాలు, ఇద్దరికి శస్త్రచికిత్స అవసరమని గుర్తించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం టి.రాణిప్రభ, ఎంఎల్‌హెచ్‌పీ ఎస్.తేజేశ్వరి, హెల్త్ అసిస్టెంటు ఎల్.రామారావు, ఆశ, జి.కూర్మావతి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ప్రాధాన్యం



శంకుస్థాపన చేస్తున్న దేవదాస్‌రెడ్డి

కంచిలి: గ్రామాల్లో మౌలిక సౌకర్యాల కల్పన, అభివృద్ధి పనులకు వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని స్థానిక ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి అన్నారు. కొల్లూరు పంచాయతీ పరిధి కర్తలి, కొల్లూరు గ్రామాల్లో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 5 లక్షల వ్యయంతో చేపట్టనున్న బోర్లు, రెండు వేల లీటర్ల సామర్థ్యం గల మినీ వాటర్ ట్యాంక్, ట్యాప్ సిస్టమ్ ఏర్పాటు పనులకు శనివారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ స్థానిక నాయకులు పైల లక్ష్మీనారాయణ, గణేష్, భీమారావు, గేదెల దాలయ్య, బోర చిన్నారావు, మద్ది మోహనరావు ఉన్నారు.

ఫారం-7 పత్రాలు పరిశీలన

కోటబొమ్మాళి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డీఎల్‌డీవో అలివేలు మంగమ్మ ఓటరు తొలగింపు, చిరునామా మార్పునకు సంబంధించి వచ్చిన ఫారం-7, ఫారం-8 పత్రాలను శనివారం పరిశీలించారు. ఈ నెల 21వ తేదీ వరకూ బీఎల్‌వోలు సేకరించిన డేటాను ఆన్‌లైన్ చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అందుకు సంబంధించిన దరఖాస్తులను మరోసారి పరిశీలన చేస్తున్నట్లు డీఎల్‌డీవో తెలిపారు. తహసీల్దార్ జామి ఈశ్వరమ్మ, ఆర్‌ఐ శివరామకృష్ణ, ఎలక్షన్ డేటా ఎంట్రీఆపరేటర్ రోజా పాల్గొన్నారు.


కేసుల రాజీపై దృష్టిసారించాలి



మాట్లాడుతున్న తేజా చక్రవర్తి మల్ల

టెక్కలి: వచ్చేనెల తొమ్మిదో తేదీన జరగనున్న మెగా లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా కక్షిదారుల్లో అవగాహన కల్పించాలని టెక్కలి జూనియర్ సివిల్ జడ్జి ఎస్.హెచ్.ఆర్.తేజా చక్రవర్తి మల్ల అన్నారు. లోక్ అదాలత్‌కు సంబంధించి ముందస్తుగా పోలీసులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కక్షిదారులంతా రాజీమార్గాన్ని అనుసరించాలన్నారు. అత్యధిక స్థాయిలో కేసులు పరిష్కారమయ్యే విధంగా పోలీసులు బాధ్యత వహించాలని సూచించారు. సీఐ సూర్యచంద్రమౌళి, ఎస్సైలు అమీర్ ఆలీ, టి.రాజేష్ ఉన్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ



మొక్కలు నాటుతున్న దృశ్యం

వజ్రపుకొత్తూరు రూరల్: మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని భారతీయ హ్యూమన్ రైట్స్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎస్.డేనియల్, స్టేట్ కోఆర్డినేటర్ పి.రాజేంద్ర అన్నారు. డోకులపాడు, హుకుంపేట, మంచినీళ్లపేట గ్రామాల్లో శనివారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. భారతీయ హ్యూమన్ రైట్స్ రాష్ట్ర కార్యదర్శి ఎ.విజయ్, మండల అధ్యక్షుడు ఎ.కృపరత్నం పాల్గొన్నారు.

మదర్ థెరిసా అడుగు జాడల్లో నడవాలి



టెక్కలి గ్రంథాలయంలో థెరిసాకు నివాళులర్పిస్తున్న పాఠకులు

టెక్కలి: సంఘ సంస్కర్త, భారతరత్న మదర్ థెరిసా అడుగు జాడల్లో నేటి తరం యువత నడవాలని టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ అన్నారు. కళాశాలలో శనివారం థెరిసా జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే టెక్కలి శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి బి.రూపావతి ఆధ్వర్యంలో థెరిసా జయంతిని నిర్వహించి.. నివాళులర్పించారు. సమాజానికి ఆమె చేసిన సేవలను గుర్తు చేశారు.

మానవతామూర్తి థెరిసా

ఇచ్ఛాపురం రూరల్: మండపల్లి తోటూరు ప్రాథమిక పాఠశాలలో థెరిసా జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. థెరిసా చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు సుహాశ్‌చంద్ మాట్లాడుతూ..మానవసేవే మాధవ సేవగా నమ్మిన మానవతామూర్తి థెరిసా అని కొనియాడారు. నాలుగో తరగతి విద్యార్థి రేష్మ థెరిసా వేషధారణలో అలరించింది. ఉపాధ్యాయులు జయలక్ష్మి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

సేవలు చిరస్మరణీయం

కంచిలి: మదర్ థెరిసా సేవలు చిరస్మరణీయమని కత్తివరం ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాధవీబెహరా అన్నారు. థెరిస్సా జయంతి సందర్భంగా పాఠశాల ఆవరణలోని ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు బి.పుణ్యావతి, టి.యోగేశ్వరరావు, టి.రవి, బి.శ్రీదేవి, ప్రవీణ్, ఈశ్వరి, పూజిత, సుచిత్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

థెరిసా జీవితం ఆదర్శప్రాయం

కవిటి: నేటి సమాజానికి మదర్‌థెరిసా జీవితం ఎంతో ఆదర్శ ప్రాయమైనదని వక్తలు అన్నారు. థెరీసా 114వ జయంతి కార్యక్రమాన్ని గొర్లెపాడు ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వహించారు. భారత దేశంలో థెరిసా చేసిన సాంఘిక సేవా కార్యక్రమాలను పిల్లలకు హెచ్‌ఎం సీతన్నాయుడు వివరించారు. ఈ సందర్భంగా థెరిసా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘననివాళులు అర్పించారు. చిన్నారులకు మిఠాయిలు పంచిపెట్టారు.



టెక్కలి: డిగ్రీ కళాశాలలో థెరిసా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ గోవిందమ్మ తదితరులు



ఇచ్ఛాపురం రూరల్: మాట్లాడుతున్న హెచ్‌ఎం సుహాశ్‌చంద్



కంచిలి: థెరిసా విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



కవిటి: గొర్లెపాడులో థెరిసా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న చిన్నారులు

టిడ్కో ఇళ్ల డబ్బులు చెల్లిస్తాం

- మున్సిపల్ ఛైర్మన్ గిరిబాబు



ప్లాస్టిక్ అమ్మకాలపై దృష్టిసారించాలని కోరుతున్న సంతోష్‌కుమార్

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో టిడ్కో ఇళ్ల కోసం నగదు కట్టిన వారికి ప్రభుత్వ ఉత్తర్వులు వచ్చిన అనంతరం తిరిగి చెల్లించేస్తామని మున్సిపల్ ఛైర్మన్ బళ్ల గిరిబాబు అన్నారు. మున్సిపల్ సర్వసభ్య సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ గురిటి సూర్యనారాయణ టిడ్కో ఇళ్ల విషయమై అడిగిన ప్రశ్నకు ఛైర్మన్ సమాధానం ఇచ్చారు. టిడ్కో ఇళ్ల కోసం కట్టిన నగదు మున్సిపల్ కమిషనర్ ఖాతాలో ఉన్నాయని ఎవరూ ఆందోళన చెందవద్దన్నారు. మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యుడు బమ్మిడి సంతోష్ మాట్లాడుతూ.. జంట పట్టణాల్లో ప్లాస్టిక్ వాడకం విచ్చలవిడిగా సాగుతోందని.. అమ్మకాలు యథేచ్ఛగా జరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. కొంతమంది ఉద్యోగులు ప్లాస్టిక్ అమ్మకందారులకు సహకరిస్తున్నారన్నారు. కౌన్సిలర్ పప్పల ప్రసాదరావు మాట్లాడుతూ.. జంట పట్టణాల్లో కుక్కల బెడద ఎక్కువ ఉందని..వీటి నియంత్రణకు చర్యలు చేపట్టాలని కోరారు. పలు వీధుల్లో వీధిదీపాలు వెలగడం లేదని.. మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కరించాలని పలువురు సభ్యులు కోరారు. సమావేశంలో వైస్ ఛైర్మన్లు బోర కృష్ణారావు, మీసాల సురేష్‌బాబు, విప్ శంకర్‌పండా, కౌన్సిలర్లు కర్రి మాధవరావు, సనపల సింహాచలం, శర్వాణ గీత, రోణంకి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

- మెజిస్ట్రేట్ హరీష్‌కుమార్



మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ రాజలక్ష్మి

ఇచ్ఛాపురం: విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని స్థానిక జూనియర్ సివిల్‌జడ్జి కోర్టు మెజిస్ట్రేట్ పి.హరీష్‌కుమార్ అన్నారు. ఇచ్ఛాపురం పట్టణంలోని రోటరీ ఫంక్షన్ హాల్లో రోటర్లీ క్లబ్ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సును శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటి సమాజం పట్ల విద్యార్థినులు సరైన అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థినులకు గుడ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. సమాజంలో ఆడపిల్లలు, మహిళలపై జరుగుతున్న లైంగిక దాడుల గురించి వివరించి జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. మహిళల రక్షణ కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న చట్టాల గురించి వివరించారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి మాట్లాడుతూ.. సమాజంలో ఎదుటి వారితో ఎలా నడుచుకోవాలో అవగాహన కల్పించారు. ఆడపిల్లల రక్షణ కోసం అమల్లో ఉన్న చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ బాలికోన్నత పాఠశాల హెచ్‌ఎం గగణకుమారి, న్యాయవాదులు, సచివాలయం ఉమెన్‌ప్రొటెక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన మందస నాయకులు



మంత్రి అప్పలరాజుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

మందస: రాష్ట్ర మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజును వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ మందస నాయకులు శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. పొత్తంగి గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు దల్లి జానకీరావురెడ్డి (కాళి)ని పార్టీ జిల్లా కార్యదర్శిగా నియమించడంతో మంత్రిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ డొక్కరి దానయ్య, జెడ్పీటీసీ సభ్యురాలు సవర చంద్రమ్మ, పార్టీ మండల అధ్యక్షుడు అగ్గున్న సూర్యారావు, యువజన కార్యదర్శి శానాపతి కిషోర్ కుమార్, వీరగున్నమ్మపురం సర్పంచ్ కర్రి గోపాలకృష్ణ, నాయకుడు గుంపు జగదీష్ ఉన్నారు.

ఎరువులను అధిక ధరకు విక్రయిస్తే చర్యలు



పూండిలోని ఎరువుల దుకాణంలో తనిఖీలు చేస్తున్న ఏడీఏ రవీంద్రభారతి

వజ్రపుకొత్తూరు: యూరియా, డీఏపీ, ఇతర కాంప్లెక్స్ ఎరువులు ఫెర్టిలైజర్స్ షాపుల్లో అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయశాఖ ఉప సంచాలకులు, ఆ శాఖ ఇంటర్నల్ స్క్వాడ్ కె.రవీంద్ర భారతి అన్నారు. వజ్రపుకొత్తూరు, పలాస మండలాల్లోని పలు ఎరువులు, పురుగుల మందు షాపుల్లో శనివారం తనిఖీలు చేపట్టారు. పూండిలోని లక్ష్మీగణపతి ఏజెన్సీ, సాయిరాం ట్రేడర్స్ తదితర షాపుల్లో తనిఖీలు చేపట్టి దస్త్రాలను పరిశీలించారు. రైతులు ఎరువులు కొనుగోలు చేసే సమయంలో బ్యాగ్ బరువు తూకం వేసి అనంతరం నగదు బిల్లులను డీలర్ వద్ద నుంచి తీసుకోవాలని సూచించారు. డీలర్లు చేతి రాత బిల్లులను మాత్రమే ఇవ్వాలని, కంప్యూటరైజ్‌డ్ బిల్లులను డీలర్లు వ్యవసాయ శాఖ అనుమతి లేకుండా వినియోగదారులకు ఇస్తే ఫిర్యాదు చేయాలని సూచించారు. తనిఖీల్లో మండల వ్యవసాయ అధికారి పి.కిరణ్‌వాణి, ఏఈఓలు ఎం. జ్యోత్స్న, ఉదయ్‌కుమార్ ఉన్నారు.

యువత దాతృత్వం



లోకేష్ కుటుంబానికి నగదు అందజేస్తున్న దృశ్యం

సోంపేట: ఇసకలపాలేం గ్రామానికి చెందిన యువత పెద్ద మనసు చాటుకున్నారు. గ్రామానికి చెందిన కోనేరు లోకేష్ ఇటీవల చెన్నైలో అనుమానాస్పదంగా మృతి చెందడంతో పెద్ద దిక్కులేని ఆ కుటుంబానికి చేయూతనందించారు. గ్రామ ప్రజలు, వివిధ సంఘాలు, పరిసర గ్రామాల నుంచి సేకరించిన రూ.1,42,500లను లోకేష్ కుటుంబానికి శనివారం అందించారు. బెపల్లి ఈశ్వరరావు, తిరుపతి, రామారావు పాల్గొన్నారు.

కృష్ణదాస్‌ను కలిసిన ఎమ్మెల్సీ రామారావు



కృష్ణదాస్‌ను సత్కరిస్తున్న రామారావు

కంచిలి: వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడుగా నియమితులైన నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్‌ను ఎమ్మెల్సీ నర్తు రామారావు మర్యాద పూర్వకంగా శనివారం కలిశారు. ఈసందర్భంగా దుశ్శాలువతో కృష్ణదాస్‌ను సత్కరించారు. పార్టీ నాయకులు తడక జోగరావు, ఇప్పిలి క్రిష్టారావు ఉన్నారు.

వైభవంగా సామూహిక వ్రతాలు



సామూహిక వ్రతాల్లో పాల్గొన్న మహిళలు

కవిటి: లోళ్లపుట్టుగలోని కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఏడు శనివారాల సామూహిక వ్రతాలు వైభవంగా జరిగాయి. ప్రధానార్చకులు అప్పలస్వామి ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా వ్రతాలను నిర్వహించారు. శ్రావణమాసంలో ప్రారంభించి ఏడు వారాలు ఉజ్జాపనగా ఈ వ్రతాలు నిర్వహించి చివరి శనివారం నాడు ముత్తైదువులకు వాయినాలు ఇవ్వడం, అన్నప్రసాద వితరణ, బ్రాహ్మణులకు దక్షిణ తాంబూలాలు అందించడం వంటి ప్రత్యేక కార్యక్రమాలతో ఈ వ్రతాలు పూర్తి చేస్తారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేకశ్రద్ధ



వాహనాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ గిరిబాబు

కాశీబుగ్గ: పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నామని మున్సిపల్ ఛైర్మన్ బళ్ల గిరిబాబు న్నారు. ఇందులో భాగంగా పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ కార్యాలయం వద్ద మున్సిపల్ శానిటేషన్ విభాగానికి చెందిన కాంపెక్టర్ వెహికల్‌ను శనివారం ప్రారంభించారు. స్వచ్ఛంధ్ర నిధులు రూ.47 లక్షలతో వాహనాన్ని కొనుగోలు చేశామన్నారు. 31 వార్డుల్లో శానిటేషన్ నిమిత్తం దీన్ని ఉపయోగించనున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ఛైర్మన్లు బోర కృష్ణారావు, మీసాల సురేష్ బాబు, కమిషనర్ టి.నాగేంద్రకుమార్, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

హోంగార్డుకు నివాళులు



గాసయ్య భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న సీఐ శ్రీనివాసరావు

కాశీబుగ్గ: కాశీబుగ్గ సర్కిల్ పోలీసు స్టేషన్ పరిధిలో హోంగార్డుగా పనిచేసిన సవర గాసయ్య (హెచ్‌జీ- 720) శుక్రవారం రాత్రి గుండెపోటుతో మరణించారు. దీంతో అతని స్వగ్రామం మెళియాపుట్టి మండలం భరణికోటకు కాశీబుగ్గ సీఐ జి.శ్రీనివాసరావు శనివారం వెళ్లి గాసయ్య మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు సంతాపాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా కాశీబుగ్గ పోలీసుస్టేషన్ పరిధిలో పనిచేస్తున్న పోలీసులు సిబ్బంది సమకూర్చిన 26,500 రూపాయలను గాసయ్య కుటుంబానికి సీఐ అందజేశారు.

రాజకీయ నేతలకు స్ఫూర్తి బొడ్డేపల్లి

- స్పీకర్ తమ్మినేని సీతారాం, మంత్రి సీదిరి అప్పలరాజు
- కాశీబుగ్గలో బొడ్డేపల్లి విగ్రహావిష్కరణ



కాశీబుగ్గ బొడ్డేపల్లి విగ్రహావిష్కరణలో స్పీకర్ తమ్మినేని సీతారాం, మంత్రి డాక్టర్ అప్పలరాజు

కాశీబుగ్గ: జిల్లా అభివృద్ధికి 1952లోనే అంకురార్పణ చేసిన మహానేత, రాజకీయ నేతలకు స్ఫూర్తిగా నిలిచిన నాయకుడు బొడ్డేపల్లి రాజగోపాలరావు అని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన బొడ్డేపల్లి విగ్రహాన్ని శనివారం ఉదయం ఆయన ఆవిష్కరించారు. అనంతరం పలాస రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. దేశంలో మెచ్చుకోదగిన నాయకుల్లో బొడ్డేపల్లి ఒకరని, ప్రధానిగా నెహ్రూ ఉన్నప్పుడు కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారని జిల్లాకు వంశధార ప్రాజెక్టు మంజూరు చేస్తామని చెబితేనే చేరుతానని అన్నారని తెలిపారు. మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయ కళాశాలలు, పరిశ్రమలు ఆయన చలవేనని అన్నారు. ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుని వెళ్లి శతజయంతిని ప్రత్యేక చట్టం చేసి నిర్వహించేందుకు యత్నిస్తామని అన్నారు. ఇప్పటికే పూర్తయిన బీఆర్‌ఆర్ ప్రాజెక్టు జిల్లా ప్రజలకు కానుకగా అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, ప్రముఖ వైద్యులు దానేటి శ్రీధర్, డాక్టర్ జీవితేశ్వరరావు, జెడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయ, మున్సిపల్ చైర్మన్ బళ్ల గిరిబాబు, టెక్కలి ఇన్‌చార్జి దువ్వాడ వాణి, మాజీ ఎమ్మెల్యే బొడ్డేపల్లి సత్యవతి, కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్, మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్, నాయకులు బడగల బళ్లయ్య, పైల వెంకటరావు, ఉంగ సాయిక్రిష్ణ, సింహాచలం, మొదలవలస మన్మధరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా సంతోషం..

- వైఎస్సార్‌సీపీ టెక్కలి సమన్వయకర్త దువ్వాడ వాణి
- కె.కొత్తూరు పంచాయతీలో 'గడప గడపకు మన ప్రభుత్వం'



మహిళలకు సంక్షేమాన్ని వివరిస్తున్న దువ్వాడ వాణి

టెక్కలి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పారదర్శకంగా అమలు చేస్తున్న నవరత్నాల పథకాలతో ఇంటింటా సంతోషం నెలకుందని వైఎస్సార్ సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణి అన్నారు. కె.కొత్తూరు గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని చేనేత కార్మికులను పలకరిస్తూ...జగనన్న ప్రభుత్వం అందజేసిన వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం లబ్ధి గురించి తెలుసుకున్నారు. అనంతరం వాణి మాట్లాడుతూ.. గత టీడీపీ ప్రభుత్వంలో చేనేత కార్మికులను పూర్తిగా నిర్లక్ష్యానికి గురి చేశారని గుర్తు చేశారు. ఆనాడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో చేనేత కార్మికులకు భరోసా కల్పించారని.. ఇప్పుడు ఆయన తనయుడు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదుకుంటున్నారన్నారు. అనంతరం గ్రామంలో ప్రతీ కుటుంబాన్ని పలకరిస్తూ గడచిన నాలుగున్నరేళ్ల పాలనలో అందుకున్న సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. కార్యక్రమంలో కె.కొత్తూరు, చాకిపల్లి, బొప్పాయిపురం, పరశురాంపురం, ముఖలింగాపురం సర్పంచ్‌లు మొర్రి శంకర్, వానతవిటయ్య, జి.మోహన్‌రెడ్డి, కె.కామేష్, బి.రాకేష్, మాజీ ఎంపీపీ సంపతిరావు రాఘవరావు, ఎంపీటీసీ సభ్యుడు పొందర దేవి శ్రీనివాస్, వైస్ సర్పంచ్ దల్లి భూలక్ష్మి, దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ మొర్రి దీప్తి, నాయకులు బోళ్ల భాస్కరరావు, బొంగు బైరాగి, డి.ప్రకాశ్, ఎ.వీరయ్య, ఎస్.రెయ్యమ్మ, జె.సత్యం, వై.బైరాగి, కె.చిన్నమ్మి, ఎస్.దేవి, చుక్క గున్నమ్మ, లాల్‌కుమార్, బి.పావని, ఎస్.మోహన్, పి.అప్పలనాయుడు, వి.నారాయణ, ఎం.ఈశ్వరరావు, డి.కూర్మారావు, జి.అప్పలరెడ్డి, డి.లోకేశ్వర్‌రెడ్డి, జి.భాను, గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.

రంగం మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరణలో మంత్రి అప్పలరాజు

కాశీబుగ్గ: రంగం ప్రజా సాంస్కృతిక వేదిక రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తిత్లీ తుపాను విలయ తాండవాన్ని ప్రపంచానికి పాటల రూపంలో చూపించారని కొనియాడారు. సాంస్కృతిక రంగంలో మరింత పురోగతి సాధించాలని ఆకాంక్షించారు. రంగం జిల్లా అధ్యక్షుడు కొర్రాయి శ్రీకాంత్, ప్రతినిధులు కోనారి సూదన్, చిగురవలస జగదీష్, ఎల్.వి.చలం, మల్లా రవికుమార్, గూన మన్మథరావు, ముడిమించి గణేష్, జయరాజు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

పార్టీ పటిష్టతకు కృషి



సోంపేట: వైఎస్సార్‌సీపీ పటిష్టతకు కృషి చేస్తానని ఆ పార్టీ జిల్లా కార్యదర్శిగా నియమితులైన ఇస్కలపాలెం గ్రామానికి చెందిన బి.రామారావు అన్నారు. జెడ్పీ ఛైర్‌పర్సన్ పిరియా విజయ, నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త సాయిరాజుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

108 వాహన సిబ్బందికి శిక్షణ తరగతులు

కాశీబుగ్గ: పలాస డివిజన్ అత్యవసర విభాగానికి చెందిన 108 వాహన ఉద్యోగులకు స్థానిక ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో వృత్యాంతర శిక్షణ తరగతులు శనివారం నిర్వహించారు. గుండె ఆరోగ్య సమస్యలు వాటి నివారణ, అపస్మారక స్థితిలో ఉన్న వ్యక్తులకు సీపీఆర్ చేయు విధానంపై అధికారులు అవగాహన కల్పించారు. జిల్లా ఏఈఎంఎస్ మేనేజర్ హరిప్రసాద్, పలాస ఓఈ జగన్ పాల్గొన్నారు.

పాడిరైతులకు హెల్త్ కార్డులు మంజూరు

కోటబొమ్మాళి: మండలంలోని 38 పంచాయతీల పరిధిలో ఉన్న ఐదు వేల మంది పాడిరైతులకు హెల్త్ కార్డులు మంజూరయ్యావని కోటబొమ్మాళి పశుసంవర్ధకశాఖ ఏడీ మంద జగన్నాథం తెలిపారు. ఇందులో భాగంగా అక్కయ్యవలస గ్రామంలోని 15 మంది పాడిరైతులకు హెల్త్ కార్డులను శనివారం అందజేశారు.

క్రైమ్‌రేటు తగ్గించేందుకు చర్యలు

కంచిలి: క్రైమ్ రేటును తగ్గించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కాశీబుగ్గ డీఎస్పీ జి.నాగేశ్వరరెడ్డి సిబ్బందిని ఆదేశించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అర్ధ సంవత్సర తనిఖీలను శనివారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దొంగతనం కేసుల పరిష్కారం, రోడ్డు ప్రమాదాలు తగ్గించేందుకు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. సోంపేట సీఐ ఆర్.రవిప్రసాద్, స్థానిక ఎస్సై ఎస్.బాలరాజు ఉన్నారు.

ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

ఇచ్ఛాపురం రూరల్: ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రముఖ వైద్యుడు డాక్టర్ దానేటి శ్రీధర్ అన్నారు. ఎం.తోటూరు గ్రామంలో శనివారం ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జెమ్స్ ఆస్పత్రికి చెందిన గుండె వైద్య నిపుణులు డాక్టర్ పి.కల్యాణ చక్రవర్తి, జనరల్ సర్జన్ డాక్టర్ జిలీష్ వాట్స్, ఫిజీషియన్ డాక్టర్ భార్గవ్‌లు రోగులను పరీక్షించి ఉచితంగా ఈసీజీ, 2డికో పరీక్షలు నిర్వహించి 215 మంది రోగులకు ఉచితంగా మందులు అందజేశారు. సర్పంచ్ పిట్ట శశిరేఖ, ఎంపీటీసీ సభ్యుడు కాళ్ల గోపీ యువసూర్య చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఎం.రాంబాబు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

టెక్కలి: రావివలస సబ్ స్టేషన్ పరిధిలో కొత్తగా స్తంభాలు ఏర్పాటు చేస్తున్నందున టెక్కలి పట్టణంలోని పలు ప్రాంతాలకు ఆదివారం విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు డీఈఈ వి.ఎ.రాజశేఖర్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం, శ్రీనివాసనగర్, ఎన్‌టీఆర్ కాలనీ, ఆర్టీసీ డిపో ప్రాంతాల్లో ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరాలో అంతరాయం ఉంటుందని..వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

కవిటిలో..

కవిటి: మండలంలోని బొరివంక ఉపవిద్యుత్ కేంద్రం పరిధిలో ఆదివారం ఉదయం 11 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ట్రాన్స్ కో ఏఈ ఎం.నేతాజీ ఒక ప్రకటనలో తెలిపారు. మాణిక్యపురం, బల్లిపుట్టుగ, వరక, కుసుంపురం, బిగొనవపుట్టుగ తదితర పంచాయతీలకు కరెంటు ఉండదని.. వినియోగదారులు గమనించాలన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

కంచిలి: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించాలని కంచిలి ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు ఇప్పిలి లోలాక్షి అన్నారు. మఠం సరియాపల్లి గ్రామంలోని ఏపీ మోడల్‌స్కూల్ ఆవరణలో ప్రిన్సిపాల్ ఎస్.శివప్రసాద్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని అన్ని మోడల్ స్కూల్ విద్యార్థినీ విద్యార్థులకు ఫ్రెండ్లీ స్పోర్ట్స్ మీట్‌లో భాగంగా శనివారం కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఫైనల్ పోటీల్లో బాలుర విభాగంలో విజేతగా ఇచ్ఛాపురం, రన్నర్‌గా మఠం సరియాపల్లి జట్లు నిలిచాయి. అలాగే బాలికల విభాగంలో విన్నర్‌గా మఠం సరియాపల్లి, రన్నర్‌గా ఇచ్ఛాపురం జట్లు గెలిచాయి. గెలుపొందిన జట్లకు ప్రజాప్రతినిధులు ట్రోఫీలు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కె.సురేష్, ఎంపీటీసీ సభ్యుడు బి.విశ్వనాథం, ఎంఈవో-2 కె.చిట్టిబాబు పాల్గొన్నారు.

ఓట్ల తొలగింపుపై పరిశీలన

మందస: మండలంలో తొలగించిన ఓట్లు సక్రమైన పద్ధతిలోనే తొలగించారా.. లేదా అనే అంశంపై డివిజనల్ కోఆపరేటివ్ అధికారి, పలాస ప్రత్యేకాధికారి బి.నగేశ్ శనివారం పరిశీలన జరిపారు. మందస తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు, బూత్ లెవెల్ సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నగేశ్ మాట్లాడుతూ.. గత ఏడాది జూన్ ఒకటో తేదీ నుంచి నేటి వరకు మండల వ్యాప్తంగా 2,600 ఓట్లు తొలగింపబడ్డాయన్నారు. ఇవి సక్రమైన పద్ధతిలో జరిగాయా.. మృతులు, మైగ్రేటెడ్ తదతర అంశాలకు సంబంధించిన సరైన ధ్రువపత్రాలు ఉన్నాయా, ఇవి ఎంతవరకు వాస్తవం అనే అంశాలపై దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఎన్నికల నియమావళికి సంబంధించిన విధులను బీఎల్‌వోలు సక్రమంగా నిర్వహించాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ బడే పాపారావు, ఎంఆర్‌ఐ సవర చిన్నారావు, ఎన్నికల డీటీ ఎస్.రాంబాబు, ఏఎస్‌వో గణపతిరావు పాల్గొన్నారు.

చిన్నారులకు చేయూత

ఇచ్ఛాపురం: తల్లి చనిపోయి, తండ్రిలేక దిక్కుతోచని పరిస్థితిలో బెల్లుపడ కాలనీలోని నాన్నమ్మ వద్ద ఉంటున్న ముగ్గురు చిన్నారులకు బెల్లుపడ యూత్‌క్లబ్ సభ్యులు అండగా నిలిచారు. చిన్నారుల నాన్నమ్మ సుభాషిని సాహు ఇంటికి శనివారం వెళ్లిన యూత్‌సభ్యులు రూ.5 వేలు నగదు, ఆరు నెలలకు అవసరమయ్యే బియ్యం, నిత్యావసర సరుకులను అందజేశారు.